ఘనంగా ఉప్పలమ్మ ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న పూసరాజు, పూస కృష్ణ

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ గంగపుత్ర కాలనీ చేపల మార్కెట్‌లోని ఉప్పలమ్మ దేవాలయ 24వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూసరాజు ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి సామూహిక కుంకుమార్చన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, నాయకులు పూస శ్రీకృష్ణ, బొల్లంపల్లి రాంరెడ్డి, జమాల్‌పురి నందు, బద్రినారాయణ, నర్సింగ్‌ప్రసాద్, మహేందర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

భారత్‌పై అమెరికా సుంకాలతో తీవ్ర నష్టం

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు



అమెరికా సుంకాలకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు

చిక్కడపల్లి: భారత్‌పై అమెరికా 50 శాతం సుంకాలను విధించడం వల్ల తీవ్రనష్టం కలుగుతుందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. అమెరికా విధించిన సుంకాలను వెంటనే ఉపసంహరించాలని ఆయన డిమాండ్ చేశారు. భారత్‌పై అమెరికా విధిస్తున్న టారీఫ్‌లకు వ్యతిరేకంగా సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్లకార్డులను ప్రదర్శించి అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విదేశాల నుంచి వ్యవసాయం, ఇతర వస్తువులను దిగుమతి చేసుకోవదంటూ కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ట్రంప్‌కు సేవకుడిగా మోదీ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ , సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.నాగయ్య, టి.సాగర్, ఎండీ అబ్బాస్, బండారు రవికుమార్, ఎండీ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

కాచిగూడ: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో యువతకు సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. పూర్తి వివరాలకు ఫోన్ నం.95058 00050.

అలరించిన ఘంటసాల గానామృతం



చిక్కడపల్లి: చంద్రతేజాలయ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో సృష్టి ఆర్ట్స్ సౌజన్యంతో బుధవారం 'ఘంటసాల గానామృతం'శీర్షికతో సంగీత విభావరి జరిగింది. స్వరాభిషేకం గాయనీగాయకులు పాల్గొని ఘంటసాల పాటలు పాడి అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు చంద్రతేజ, డీఏ మిత్ర బాలకామేశ్వరరావు, శశికళాస్వామి, సురేఖామూర్తి, శివరాంరెడ్డి, మోహన్, సూర్యతేజ పాల్గొన్నారు.

పురస్కారాల ప్రదానోత్సవం



చిక్కడపల్లి: తల్లిదండ్రుల పేరిట ఉత్తమ కార్యక్రమాలను నిర్వహించడం ప్రశంసనీయమని కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు. భీమన్న సాహితీనిధి, కళానిలయంల సంయుక్త ఆధ్వర్యంలో మధురగాయని, ప్రముఖ రచయిత్రి హైమవతి భీమన్న పుట్టిన రోజు సందర్భంగా తల్లిదండ్రులు కొత్తూరి వెంకటలక్ష్మి, సుబ్బయ్య దీక్షితుల స్మారక పురస్కార ప్రదానోత్సవం బుధవారం రాత్రి త్యాగరాయ గానసభలో జరిగింది. ప్రముఖ బాల కథా రచయిత్రి ఆకెళ్ల వెంకటసుబ్బలక్ష్మికి సముద్రాల వేణుగోపాలాచారి ముఖ్యఅతిథిగా పురస్కారాన్ని ప్రదానం చేసి సన్మానించారు. తొలుత ప్రముఖ నృత్య గురువు రేణుకాప్రభాకర్ శిష్యబృందం కూచిపూడి నృత్యాంశాలను ప్రేక్షక రంజకంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు ఆచార్య గౌరీశంకర్, జయరాములు, విజయలక్ష్మి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతను పెంచేందుకే

'హర్ ఘర్ తిరంగా'

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



రెడ్డి మహిళా కళాశాల విద్యార్థులతో హర్ ఘర్ తిరంగా ర్యాలీలో ఆర్.కృష్ణయ్య, ప్రిన్సిపాల్ అచ్యుతాదేవి

కాచిగూడ: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజల్లో ఐక్యత, సమగ్రతను పెంపొందించడానికే 'హర్ ఘర్ తిరంగా..'కార్యక్రమం చేపట్టామని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం రాజా బహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాల విద్యార్థినులు జాతీయ జెండాలతో బర్కత్‌పురలో ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ... జాతీయ జెండాను ప్రతి ఒక్కరూ ఆవిష్కరించి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ వారి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు. స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో యువత ముందుకు సాగాలన్నారు. దేశ సమగ్రతకు యువత కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. యువత చేతిలోనే దేశ భవిత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. అచ్యుతాదేవి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, కోల జనార్దన్, తంగెళ్లముడి నందగోపాల్, చెరకు మణికంఠ, పృథ్వీగౌడ్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

బాగ్‌లింగంపల్లి చౌరస్తా నుంచి క్రాస్‌రోడ్ వరకు..

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: బీజేపీ రాంనగర్ డివిజన్ అధ్యక్షులు గడ్డం సతీష్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. బాగ్‌లింగంపల్లి చౌరస్తా నుంచి భారీ ఎత్తున ప్రారంభమైన తిరంగా యాత్ర సుందరయ్య పార్కు, అంబేడ్కర్ కాలేజ్, చిక్కడపల్లి, మూన్ కేఫ్, ఆర్టీసీ క్రాస్‌రోడ్ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు పార్థసారథి, జయపాల్‌రెడ్డి, కాలకోట అరుణ్, శీలం ప్రవీణ్, కె.ఉపేందర్, జక్క శ్రీను, ఉమామహేశ్వర్, బీరయ్య, మంగళ, జ్యోతి, బస్సీనాయక్, ప్రవీణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



అశోక్‌నగర్ నుంచి ప్రారంభమైన తిరంగా బైక్ ర్యాలీలో ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్



బాగ్‌లింగంపల్లిలో తిరంగా యాత్రను ప్రారంభిస్తున్న గడ్డం సతీష్

ప్రతి పౌరుడు జాతీయ భావాలు కలిగి ఉండాలి..

అంబర్‌పేట: హర్ ఘర్ తిరంగా ర్యాలీలతో ప్రజల్లో దేశభక్తిని పెంపొందించాలని సెంట్రల్ జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు ఎస్.గౌతంరావు అన్నారు. బుధవారం బాగ్‌అంబర్‌పేటలో పార్టీ శ్రేణులు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో బాబుజగ్జీవన్‌రామ్, దుర్గాబాయి దేశ్‌ముఖ్‌ల విగ్రహాలను శుద్ధి చేశారు. అనంతరం తిరంగా ర్యాలీని గౌతంరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌతంరావు మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు జాతీయ భావాలు కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎడెల్లి అజయ్‌కుమార్, గోవర్ధన్‌రెడ్డి, నాగరాజుచారి, చుక్కా జగన్, ఈఎస్ ధనుంజయ, అచ్చిని రమేష్, కె.చంద్రశేఖర్, ప్రవీణ్‌కుమర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరమణ చౌరస్తా నుంచి పూలే విగ్రహ చౌరస్తా వరకు..

అంబర్‌పేట డివిజన్‌లో బీజేపీ నేతలు తిరంగా ర్యాలీ నిర్వహించారు. శ్రీరమణ చౌరస్తా నుంచి మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహ చౌరస్తా వరకు చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు నాభూషణంచారి, నరేష్‌గౌడ్, యశ్వంత్, నవీన్ రెడ్డి, భిక్షపతి, వెంకటేశ్‌గౌడ్, మైలారం రాజు, దయాకర్‌యాదవ్, పెంటం రాజు తదితరులు పాల్గొన్నారు.

ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా నుంచి ర్యాలీ..

నల్లకుంట: ప్రధాని మోద పిలుపు మేరకు నల్లకుంట బీజేపీ శ్రేణుల ఆధ్వర్యంలో బుధవారం ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా నుంచి హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ డివిజన్ పరిధిలోని ప్రధాన ప్రాంతాల్లో కొనసాగింది. ఈ ర్యాలీలో మాజీ కార్పొరేటర్ వనం రమేష్, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కేజే బాబు, ఓబీసీ మోర్చా కార్యదర్శి ఎంటీ కిషోర్‌కుమార్, ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు కె. లక్ష్మణ్ కుమార్, డివిజన్ అధ్యక్షుడు ప్రశాంత్ జోషి, ఎం. శ్యామ్‌రాజ్, పెంటం ధర్మేందర్, శివ మంగి, సుమన్, మధుసూదన్, మధుయాదవ్, మాచర్ల అర్జున్, వెంకటేష్ గౌడ్, ఎం.సాయి తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తిని చాటుకోవడానికి తిరంగా యాత్ర...

చిక్కడపల్లి: ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో మన దేశం ప్రపంచంలోనే అగ్రగామిగా మారుతోందని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హర్ ఘర్ తిరంగా ర్యాలీని బుధవారం అశోక్‌నగర్ నుంచి ట్యాంక్ బండ్ వరకు నిర్వహించారు. మహంకాళి సికింద్రాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్, బీజేవైఎం అధ్యక్షుడు మద్దూరి శివాజీ ఆధ్వర్యంలో భారీ తిరంగా ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగురవేసి దేశభక్తిని చాటుకోవడానికి చేస్తున్న కార్యక్రమమే తిరంగా యాత్ర అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నేత వెంకటరమణి, కార్పొరేటర్లు రవిచారి, సుప్రియ నవీన్‌గౌడ్, నాయకులు ఎ.వినయ్‌కుమార్, వెంకటరమణి, రమేష్ రామ్, పూసరాజు, మేకల సారంగపాణి, శేషసాయి తదితరులు పాల్గొన్నారు.

తిరంగా యాత్రలో దత్తన్న..

ముషీరాబాద్: రాంనగర్‌లోని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ నివాసం నుంచి బాగ్‌లింగంపల్లి వరకు హర్ ఘర్ తిరంగా యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా తిరంగా ర్యాలీని బండారు దత్తాత్రేయ జెండా ఊపి ప్రారంభించారు. బండారు వైష్ణవ్ ఫౌండేషన్, అలయ్ బలయ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ మహంకాళి జిల్లా మాజీ అధ్యక్షుడు బి.శ్యామ్‌సుందర్‌గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



డీడీకాలనీలోని దుర్గబాయి దేశ్‌ముఖ్ విగ్రహాన్ని శుద్ధి చేసిన బీజేపీ నేతలు



నల్లకుంట డివిజన్‌లో జరిగిన తిరంగా ర్యాలీలో మాజీ కార్పొరేటర్ వనం రమేష్, బీజేపీ నాయకులు



రాంనగర్‌లో తిరంగా యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న బండారు దత్తాత్రేయ



అంబర్‌పేట శ్రీరమణ చౌరస్తా నుంచి మొదలైన తిరంగా ర్యాలీలో బీజేపీ నాయకులు

అభివృద్ధిలో రాజీపడేది లేదు

ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: బస్తీలు, కాలనాల అభివృద్ధిలో ఏ మాత్రం రాజీపడేది లేదని ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. బుధవారం గోల్నాక డివిజన్ సంజయ్ గాంధీనగర్ బస్తీలో రూ.36 లక్షల వ్యయంతో చేపట్టనున్న వర్షపునీటి పైపులైన్ నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు, సిబ్బంది, స్థానిక బస్తీ నేతలు డి.లక్ష్మణ్, జ్ఞానేశ్వర్, ఎస్.యాదగిరి, ఎం.శివకుమార్, ప్రవీణ్, జి.ప్రదీప్ కుమార్, సీహెచ్ శివకుమార్, బి. కిరణ్‌కుమార్, బి.బుజ్జికళ, డి.శోభారాణి, ఎస్.మాధవి, సీహెచ్ ధనలక్ష్మి, బీఆర్‌ఎస్ నేతలు కాలేరు రాజు, భరత్ రాజ్, మహ్మద్ యూసుఫ్, సంతోష్, రంజిత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సంజయ్‌గాంధీనగర్‌లో వరదనీటి పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

ప్రభుత్వ స్థలాల్లో కమ్యూనిటీహాళ్లు నిర్మిస్తాం

ముషీరాబాద్: స్థానిక ప్రజల కోరిక మేరకు కాలనీ, బస్తీలలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాల్లో కమ్యూనిటీహాళ్లను నిర్మిస్తామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బుధవారం భోలక్‌పూర్ డివిజన్ రంగానగర్ సెకండ్ వెంచర్‌లో జీహెచ్‌ఎంసీ డీఈ సన్నీతో కలిసి ఎమ్మెల్యే ముఠా గోపాల్ పర్యటించారు. ఈ సందర్భంగా మహిళలు, డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు వై.శ్రీనివాస్‌రావు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. స్థానికంగా 400 దళిత కుటుంబాలు నివసిస్తున్నాయని తెలిపారు. శుభకార్యాలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు స్థలం లేక రోడ్లపైనే నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు. దీని వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆయనకు తెలిపారు. స్థానికంగా ఉన్న ఖాళీ స్థలంలో కమ్యూనిటీహాల్ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

- అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... గతంలో రంగానగర్ సెకండ్ వెంచర్‌లో ఉన్న కమ్యూనిటీ హాల్ శిథిలావస్థకు చేరి కూలిపోయిందన్నారు. ఇదే స్థలంలో కమ్యూనిటీహాల్ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి స్థానిక ప్రజల కోరికను నెరవేర్చే విధంగా పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బింగి నవీన్, నాయకులు రహీం, రంగానగర్ బస్తీ ప్రధాన కార్యదర్శి వినోద్, నాయకులు మల్లేష్, ధర్మేందర్, సుమన్, కృష్ణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు



మోహన్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో కంటి పరీక్షలు చేయించుకుంటున్న ముఠా జైసింహ

ముషీరాబాద్: కంటి చూపు సమస్య ఉంటే నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. బుధవారం మోహన్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో అక్యూలెస్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ... ప్రైవేటు వైద్య సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు పేదలు నివసించే ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు. ఇటీవల కంటి సమస్యలు చిన్న పిల్లలకు సైతం వస్తున్నాయని వైద్యులను సంప్రదించి సరైన వైద్యం తీసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీధర్ రెడ్డి, డి.శివముదిరాజ్, నర్సింగ్‌రావు, వీరేష్, సత్యనారాయణ, ఆసుపత్రి ప్రతినిధులు జయంత్, మహేష్, జగన్, అనూష, హారిక తదితరులు పాల్గొన్నారు.

ఫాసిస్టులను అడ్డుకోవాలంటే విప్లవ సంస్థలు ఏకం కావాలి



మాట్లాడుతున్న వెంకటరామయ్య

ముషీరాబాద్: హిందూ ఫాసిస్టులను తుదముట్టించాలంటే భారతదేశంలోని విప్లవ సంస్థలన్నీ ఐక్యం కావాల్సిన అవసరం ఉందని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమాక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు వేములపల్లి వెంకటరామయ్య పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్ విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలు రాజ్యాంగ విలువలు, సంస్థలను నిర్వీర్యం చేస్తూ అన్నివర్గాల ప్రజలపై దాడులు చేస్తున్నాయని అన్నారు. విప్లవకారుల ఐక్యతకు కృషిలో భాగంగా 2024 డిసెంబర్‌లో ఆంధ్ర, తెలంగాణలో కొనసాగుతున్న రెండు న్యూడెమాక్రసీ సంస్థలు విలీనమై ఒకే పార్టీగా కొనసాగుతున్నాయని అన్నారు.

- అఖిల భారత స్థాయిలో కలిసి పనిచేసిన ప్రావిజనల్ సెంట్రల్ కమిటీ (పీసీసీ)తో న్యూడెమాక్రసీ ఏడేళ్లుగా ఐక్యత చర్చలను కొనసాగిస్తూ ఈనెల 10న పశ్చిమబెంగాల్‌లో పార్టీల మధ్య జరిగిన చర్చలు సఫలమై ఒకే న్యూ డెమాక్రసీగా కొనసాగేందుకు ఇరు పార్టీల నేతలు అంగీకరించినట్లు తెలిపారు. ఈ ఐక్యత విలీనం భవిష్యత్‌లో విప్లవోద్యమాన్ని బలోపేతం చేయడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు.
- ఈ హిందూ మతోన్మాద ఫాసిజానికి వ్యతిరేకంగా ఐక్య పోరాటానికి కృషి చేస్తామని తెలిపారు. అలాగే ట్రంప్ విధిస్తున్న సుంకాలను మోదీ సమర్థవంతంగా తిప్పికోట్టలేక ట్రంప్‌కు గులాంగిరి చేస్తున్నారని విమర్శించారు. సింధూర్ విషయంలోనూ అదే జరిగిందని తెలిపారు. అలాగే ఎలక్షన్ కమిషన్ కూడా అధికార పార్టీ కనుసన్నల్లో పనిచేస్తూ ఓట్ల దొంగతనానికి పాల్పడుతోందని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు జేవీ చలపతిరావు, సాధినేని వెంకటేశ్వర్‌రావు, గోవర్ధన్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

గోవు ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ గోమాత గానామృతం కదంబమాల వీడియో సీడీ ఆవిష్కరణ మహోత్సవం బుధవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. గోవు ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికీ తెలియజేయాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సువర్ణభారతి గోశాల వ్యవస్థాపకుడు పి.శ్రీనివాస బంగారయ్య శర్మ పాల్గొన్నారు.

పేదలకు పక్కా గృహాలు ఇవ్వాలి



మొరంబొంద బస్తీలో సర్వే చేస్తున్న తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్, కార్పొరేటర్ సుప్రియ

ముషీరాబాద్: ఇటీవల ప్రజా పదంలో పక్కా గృహాల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులందరికి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం ముషీరాబాద్ డివిజన్‌లోని మొరంబొంద ప్రాంతానికి చెందిన ప్రజలు ఇటీవల పక్కా గృహాల కోసం దరఖాస్తు చేసుకుంటే ఎల్-3 అని(సొంత ఇళ్లు ఉన్నాయని) అధికారులు తప్పుడు రిపోర్టులు రాశారని స్థానికులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఆమె స్పందించి ఈ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సర్వే చేయాలని కలెక్టర్ ఆదేశించడంతో ముషీరాబాద్ తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్, రెవెన్యూ ధికారులు మొరంబొందలో ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు.

- ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పక్కా గృహాల కోసం 53 మంది స్థానికులు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. అందులో ఏ ఒక్కరికి సొంత ఇళ్లు లేవని తెలిపారు. అద్దె ఇళ్లలో నివసించే వీళ్లందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలన్నారు.
- తహసీల్దార్ మాట్లాడుతూ... జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇంటింటికీ వెళ్లి దరఖాస్తుదారుల వివరాలను సేకరించామని అన్నారు. పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, సత్యనారాయణ, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిని కాజేయాలని యత్నించి జైలుపాలు!

- ఫోర్జరీ పత్రాలు సృష్టించిన నలుగురు
- ఒకరిని రిమాండ్ చేసిన పోలీసులు
- పరారీలో వినోద్, జహంగీర్, దివ్యశ్రీ



నిందితుడు రమేష్‌చారి

అంబర్‌పేట: నకిలీలీ పత్రాలు సృష్టించి ఓ ఇంటిని కాజేసేందుకు యత్నించిన నలుగురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటన బుధవారం అంబర్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.... డీడీకాలనీకి చెందిన పొలాదాస్ వెంకటయ్యకు 244 గజాల ఇల్లు ఉంది. ఇతను 2016 మృతిచెందగా భార్య 2022 తప్పిపోయి ఆచూకీ లేకుండా పోయింది. వీరికి పిల్లలు లేకుంటే దత్తపుత్రికను తీసుకుంటే ఆమె ఆమెరికాలో స్థిరపడింది. వెంకటయ్యకు సంబంధించిన వారు ఇక ఎవరూ లేరని భావించి రామంతాపూర్‌కు చెందిన డీ.వినోద్(35) న్యాయవాది దొడ్డిదారిన 244 గజాలకు సంబంధించిన ఇంటి ప్రతాలను సంపాదించాడు.

- అనంతరం జహంగీర్ అనే వ్యక్తితో కార్వాన్‌కు చెందిన పాచిపాల రమేష్‌చారి(50)కి అందించాడు. దీంతో రమేష్‌చారి 2016 వెంకయ్య తనకు వీల్‌డీడ్ చేశాడని నకిలీ పత్రాలు సృష్టించాడు. అతడి కూతురు దివ్యశ్రీ పేరిట 2023 గిఫ్ట్‌డీడ్ చేశాడు. దానిపై రెండు దఫాలుగా రూ.80 లక్షల రుణం కూడ తీసుకున్నారు.
- అనంతరం రమేష్‌చారి గత నెల ఇంటిని స్వాధీనం చేసుకునేందుకు వెళ్లగా అందులో వెంకటయ్య సోదరుడు సత్యనారాయణ నివాసం ఉంటున్నాడు. దీంతో రమేష్‌చారి, వినోద్‌లు తమ ఇంట్లో ఎందుకు ఉంటున్నావని అడిగాడు. 2016లో వెంకటయ్య తమకు వీల్‌డీడ్ చేశాడని బెదిరించారు. మా అన్న మీకు ఎలా వీల్‌డీడ్ చేశాడని ఆయన ప్రశ్నించాడు. మాకు దూరపు బంధువంటూ అతడిపై దౌర్జన్యం చేశారు.
- దీంతో సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు లోతుగా దర్యాప్తు చేసి వినోద్, రమేష్‌చారిలు ఫోర్జరీ, కబ్జా, మోసం వంటి నేరాలకు పాల్పడినట్లు తేల్చారు. దీంతో బుధవారం రమేష్‌చారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. అతడికి కోర్టులు 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు. వినోద్, జహంగీర్, దివ్యశ్రీ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... ఫలక్‌నుమా ప్రాంతానికి చెందిన బాలరాజు (72) రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి. ప్రతిరోజు సాయంత్రం వాకింగ్ చేయడానికి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. మంగళవారం రాత్రి ఫలక్‌నుమా రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ: రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ రైల్వే ఠాణా పరిధిలో జరిగింది. ఉప్పుగూడకు చెందినదశరథ(44) అనారోగ్య కారణాలతో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించి వెళ్లి పోయాడు. ఈ క్రమంలో ఫలక్‌నుమా రైల్వేస్టేషన్ వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపారు.